# అమ్మవొడి!

## గొపరాజు వెంకట నరసింహారావు

"సుగుణ డెలివర్డ్. మదర్ అండ్ డాటర్ సేఫ్" అన్న సమాచారాన్ని తీసుకొచ్చిన టెలిగ్రామ్‌ని చూసిన తరువాత నా మనస్సులోని టెన్షన్ పటాపంచలైపోయింది. ఇప్పుడు నేను ఒక చిన్న పాపాయికి తండ్రినన్న భావం కలగ్గానే గుండెలోపలి పొరల్లో ఏదో అనిర్వచనీయమైన అనుభూతి. ఇన్నాళ్లు ఏవేవో భయానకమైన దృశ్యాలను చూసిన నా మనోఫలకం ఇప్పుడు అందమైన దృశ్యాలను చిత్రీకరిస్తోంది. తన చిన్న చేతుల్తో నా చేతిని గట్టిగా పట్టుకుని వచ్చీరాని అడుగులతో తడబడుతూ నాతోబాటు నా కూతురు నడుస్తున్న దృశ్యం చాలా అద్భుతంగా ఉంది. నా గుండెలమీద నిద్రపోయిన పాపాయిని నేను అపురూపంగా చూసుకుంటున్న దృశ్యం ఇంకొకటి. నిన్నటిదాకా రకరకాల ఆలోచనలతో అయోమయంగా గడిపిన నాకు ఇంత ఆనందం లభిస్తుందని కలలో కూడా ఊహించలేదు. సుగుణకి ధైర్యం చెప్పాను. కాని, పురుటికి వెళ్లిన తరువాత ఒంటరిగా ఉన్న నాలో అలజడి ప్రారంభమైంది. పాడు మనస్సు ఎప్పుడూ చెడునే ఆలోచిస్తుంది. సుగుణకి ఏమైనా అయితే? అన్న ప్రశ్న ప్రతీరోజూ కొన్ని వందలసార్లు మదిలో ముల్లులా గుచ్చుకునేది. స్త్రీని అంత కష్టపెడుతున్న భగవంతుని సృష్టిమీద కోపం వచ్చేది. తల్లి గర్భంలో హాయిగా నవమాసాలు ఉండి ఈ భూమిమీదకొచ్చే శిశువుకి తెలియదు తన జననంకోసం తల్లి ప్రాణం గిలగిలలాడుతుందని. అయినా భగవంతుణ్ణి నిందించవలసిన అవసరం లేదు. ఒక గొప్ప కార్యం జరగడానికి నేపథ్యంలో ఎంతోమంది శ్రమ ఉంటుంది. అందుకే మనం తెర ముందు కనబడేవాటికంటే తెరవెనుక వారి గురించి ఒక్కసారి ఆలోచిస్తే వాళ్లకు న్యాయం చేసినవాళ్లమవుతాం. పాట వింటున్నవాళ్లకు తెలియదు ఆ పాట కోసం ఒక నాలిక మెలికలు తిరిగిపోతుందని. కవిత్వం చదువుతున్నవాళ్లకు తెలియదు కాగితం మీద కలం కదలికకోసం కవి మెదడులోని నరాలు తెగుతాయని. నర్తిస్తున్న నాట్యకారిణిని చూసి ఆనందించే మనం ఆ నర్తించే పాదాలకు నడకలు నేర్పిన తల్లి గురించి పట్టించుకోం.

సుగుణని చూడాలని ఉంది. అవును సాధ్యమైనంత త్వరలో ఆ పని చెయ్యాలి. బిడ్డకు జన్మనిచ్చిన తల్లి మోములోని ఆనందాన్ని చూడాలి. పేగు తెంచుకుని పుట్టిన బిడ్డకు పాలిచ్చిన తరువాత తల్లి బుగ్గల్లో విరిసే పారిజాతాన్ని చూడాలి.

మొదటి గర్భం కావడంతో నెలలు నిండుతున్న కొద్దీ సుగుణలో భయం తాలూకు నీలినీడలు స్పష్టంగా కనబడేవి. నాకూ అదోలా ఉన్నా సుగుణ భయపడుతుందని బింకంగా ఉండేవాణ్ణి. అర్ధరాత్రి నిద్రలేచి భయంతో వెక్కి వెక్కి ఏడ్చేది. నేను సముదాయిస్తుంటే నా గుండెలమీద తల ఆన్చి చిన్నపిల్లలా నిద్రపోయేది. సుగుణ కళ్లల్లోంచి కన్నీరు బొట్లు బొట్లుగా పడుతూ గుండెని వింత స్పందనకి గురిచేసేది. మొదటికాన్పు కనుక ఆరవనెల రాగానే పుట్టింటికెళ్లి విశ్రాంతి తీసుకోమని ఎంత బతిమాలినా విన్పించుకోలేదు. నాకు ఇబ్బంది అవుతుందని ఎనిమిదో నెల వచ్చిన తరువాత వెళ్లింది.

ఏడోనెల వచ్చిన తరువాత సుగుణ ఆయాసపడుతూ మెల్లగా ఇంట్లో తిరుగుతుంటే ఎందుకో విచిత్రంగా అనిపించేది. కాళ్లకు కొంచెం నీరు పట్టి లావుగా కనిపించేవి. అప్పుడపుడూ రహస్యంగా గమనించేవాణ్ణి పొట్టమీద చేతులు వేసుకుని పసికందు కదలికలద్వారా ఏం చెప్పేదో తెలియదు కాని ముసిముసి నవ్వులు నవ్వుకునేది.

ఆఫీసులో ఇన్‌స్పెక్షన్ ఈ రోజుతో అయిపోతుంది. వచ్చేవారం శెలవు పెట్టి అత్తారింటికి వెళితే బాగుంటుంది. మరదలు శ్యామలకి కుక్కపిల్లలంటే చాలా ఇష్టం. ఎప్పుడో సంవత్సరం క్రితం ఆ అమ్మాయికి కుక్కపిల్లని తెస్తానని ప్రామిస్ చెయ్యడం జరిగింది. అదృష్టవశాత్తు కొలీగ్ కృష్ణమూర్తి ఇంట్లోని పెంపుడు కుక్క మూడు పిల్లల్ని వారం రోజుల క్రితం ఈనిందని చెప్పాడు. అత్తారింటికెడుతున్నప్పుడు దానిని తీసుకెళితే శ్యామల మాట నిలబెట్టుకున్నందుకు చాలా సంతోషిస్తుంది.

అమ్మాయికి ఏం పేరు పెడితే బాగుంటుంది? సుగుణలా అందంగా ఉంటుందా? ఏది ఏమైనా పాపాయిని చాలా క్రమశిక్షణతో పెంచాలి. ఎక్కువగా గారాబంచేసి పాడు చెయ్యకూడదు.

అత్తగారి ఊరు కోనసీమలో ఉంది. ఆ ఏరియా అంటే నాకెంతో ఇష్టం. ఎక్కడో మహారాష్ట్రలో పుట్టి ఆంధ్రదేశాన్ని సస్యశ్యామలంగా మార్చిన గోదావరి ఒడిలో ఒదిగిన అందాల హరివిల్లది. వరి చేలు నేలంతా పచ్చని కార్పెట్ పరచినట్టుంటాయి. కొబ్బరిచెట్లు క్రమశిక్షణ కల్గిన సైనికుల్లా దేశాన్ని కాపలా కాస్తున్నంత సీరియస్‌గా వరుసగా నిలబడి ఉంటాయి. నర్సాపురం దగ్గర రైలుదిగి గోదావరి దాటాలి. గోదావరిలో పడవ ప్రయాణం మాటలకందని మధురమైన అనుభూతి. ఎగసిపడుతున్న అలల తాకిడికి పడవ ఊగిపోతూ ఉంటుంది. కొత్తవాళ్లకైతే మునిగిపోతుందేమోనన్న భ్రాంతి కలుగుతుంది. తీవ్రంగా వచ్చిన అల పడవని ఢీకొని ముత్యాల జల్లు కురిసినట్లు ఒళ్లంతా పడుతుంది.

అనుకున్నట్టుగానే సెలవు శాంక్షన్ అయ్యింది. సికింద్రాబాద్–నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్‌కి బయలుదేరాలి. సికింద్రాబాద్ స్టేషన్ దగ్గరవడం చేత ఒక గంట ముందుగా పెట్టెతో సహా కృష్ణమూర్తి ఇంటికి వెళ్లాను. కుక్కపిల్లను తీసుకొస్తుంటే దాని తల్లి 'అదోలా' చూసింది. కాని పుట్టి కొద్దిరోజులే అయిందేమో చాలా ముద్దొస్తోంది. సీమ జాతిది కాకపోయినా చూడ్డానికి మాత్రం అలాగే ఉంది. తెల్లని బొచ్చుని చూస్తూంటే ఒళ్లంతా దూది అంటించినట్టుంది. ఈ శుభసందర్భంలో ఇంత మంచి బహుమతి ఇచ్చినందుకు మరదలు శ్యామల ఆశ్చర్యపోవాలి. శ్యామల చాలా చలాకీ అయిన అమ్మాయి. సుగుణకీ శ్యామలకీ వయస్సులో పది సంవత్సరాల తేడా ఉంది. శోభనం నాడు జరిగిన హంగామా గుర్తుకొస్తే ఇప్పటికీ నవ్వు వస్తుంది. శ్యామలకి వాళ్లక్క దగ్గరే పడుకోవడం అలవాటుట. ఆరోజు కూడా అక్క దగ్గర పడుకుంటానని ఏడ్చింది. సుగుణ నుంచి శ్యామలను వేరే చేసేటప్పటికి పెద్దలు దిగివచ్చారు. నా ఊహలు మా పెళ్లినాటి విషయాల చుట్టూ తిరగడం ప్రారంభించాయి. పల్లెటూరి అమాయకత్వం, స్వచ్ఛతనిండా నింపుకున్న సుగుణ నా జీవితాన్ని నందనవనం చేసిందనే చెప్పాలి. ఈ పెళ్లయిన రెండేళ్లలో కూడా సుగుణని ఎప్పుడూ కోపం, చిరాకులతో చూడలేదు. కుక్కని గొలుసుతో కట్టేసి నిద్రకు ఉపక్రమించాను. నా ఆలోచనలతో నేను గమనించలేదు గాని కుక్కపిల్ల సీరియస్‌గా కాళ్లమీద తల పెట్టుకుని పడుకుంది. తప్ప దానిలో మరే కదలికా లేదు. బిస్కట్లు పెట్టినా తినలేదు. నా హుషారులో ఉన్న నేను దానిని పెద్ద ఉపద్రవంగా గుర్తించలేదు.

ఇంటికెళ్లగానే ముందుగా శ్యామలే ఎదురైంది. కుక్కపిల్లని ఒళ్లోంచి లాక్కుంది. పాపాయి ఎంతో ముద్దుగా ఉందిట. రోజూ పాపాయికి నీళ్లు తనే పోస్తోందిట. పోలికలు నావేనట, ముక్కు మాత్రం నాది కాదట. ఇవన్నీ ఒక్క నిమిషంలోనే చెప్పేసి స్నేహితురాళ్లకి చూపించడానికి బయటికెళ్లిపోయింది.

సుగుణ నన్ను చూడగానే నవ్వింది. ఆ కళ్ళల్లో ఏదో వింత వెలుగు. నీరసంతో పాలిపోయిన ఆమె మొహం మరింత తెల్లగా కనబడుతోంది. నడుంకి కట్టు, కాళ్లకి చెప్పులు, చెవుల్లో దూది ఇదీ అవతారం.

కాళ్లు కడుక్కున్న తరువాత ఉయ్యాలలో నిద్రపోతున్న పాపాయిని చూశాను. అరచేతిలో ఏదో వస్తువుని అపురూపంగా దాచుకున్నట్లు గుప్పెళ్లు మూసి నిద్రపోతోంది పాపాయి. మనస్సులోని ఆనందతరంగాల్ని ఆపుకోలేక పాపాయి మీదికి వంగి ముద్దు పెట్టబోయాను. 'ఎంగిలి చిన్నవాళ్ల బుగ్గలకు తగిలితే అవి పాడయిపోతాయండీ' అంటూ వారించింది సుగుణ. ఎంత స్వార్థం? నా కోరిక తీరకపోయినా ఫర్వాలేదు పాపాయి అందం చెడిపోకూడదు. గదిలో ఎవరూ లేరు. గుమ్మంకేసి చూశాను. ఎవరూ వస్తున్న సూచనలు కూడా లేవు. సుగుణని ముద్దు పెట్టుకున్నాను. ఇందాకా దొడ్లో కాళ్లు కడుక్కుంటున్నప్పుడు చూసిన ఎర్ర గులాబీమొగ్గ సుగుణ బుగ్గలమీద విరిసింది. అప్పుడు సుగుణ నవ్విన నవ్వు ఎప్పటికీ మర్చిపోలేను.

గది బయటికొచ్చి హాలులో కూర్చున్న మావగారి దగ్గరికొచ్చాను. అక్కడ శ్యామల స్నేహితుల దగ్గరకెళ్లి తిరిగి వచ్చేసింది కాబోలు. కుక్కపిల్లకి బలవంతంగా పాలు పట్టించడానికి ప్రయత్నిస్తోంది. బలవంతంగా మూతిని పాలగిన్నెలోకి పెట్టినా అది నోరు తెరిచి తాగడం లేదు. "ఏమిటి బావగారూ ఇలాంటి దాన్ని తెచ్చారు? ఇదేమీ తినడం లేదు. తాగడం లేదు. ఏదో మందు తిన్నట్టు మందంగా ఉంది" అంది శ్యామల.

"కడుపు మాడిన తరువాత అదే తాగుతుందిలే" అని ఓదార్చాను.

రెండు రోజులు సరదాగానే గడిచింది. మూడవ రోజు ఉదయమే పాపాయికి ఒళ్లు కొంచెం వెచ్చబడింది. సుగుణ ఏడుపు మొదలు పెట్టింది. ఇంట్లో అందరూ హడావిడి పడిపోతున్నారు. ఎవ్వరూ పచ్చి మంచినీళ్లుకూడా ముట్టుకోలేదు. మావగారు డాక్టరుగారి కోసం పరుగెత్తారు. కేవలం కొద్ది రోజుల క్రితం ఈ భూమిమీద అడుగు పెట్టిన పాపాయి మా జీవితాల్లో ఎంతో ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ అనుబంధాలు, సెంటిమెంట్స్ చూస్తుంటే చాలా వింతగా అనిపిస్తోంది. అందరూ పాపాయి మంచం చుట్టూ చేరారు. మావగారు కాలుగాలిన పిల్లిలా తిరుగుతున్నారు.

హాలులోకొచ్చారు. కుక్కపిల్ల అలాగే పడుకుని ఉంది. దానిముందు పాలగిన్నె నిండుగా ఉంది. ఇంచుమించు లేవలేని పరిస్థితికొచ్చేసింది. ఇప్పుడు అది నాకొక సమస్య. అది చచ్చిపోతే ఆ పాపం నాకు చుట్టుకుంటుంది.

హఠాత్తుగా నా మస్తిష్కంలో ఒక మెరుపు మెరిసింది. నేను మనుషుల మనస్తత్వాలను అంచనా వేయగలనన్న నమ్మకం నాకిన్నాళ్లు ఉండేది. అది ఆ దేవుడికే తెలియాలి. కాని ఒక మూగ జంతువు మూడు రోజుల్నుంచీ పడుతున్న నరకయాతనని అర్థం చేసుకోకుండా మూర్ఖుడిలా ప్రవర్తించాను.

తల్లిప్రేమ విశ్వజనీనమైనది. ఆ అద్వితీయ మధురభావనకి మనుషులు, జంతువుల తేడా లేదు. ఇంత చిన్న విషయం నాకెందుకు తట్టలేదో అర్థం కావడం లేదు. పాపాయికి కొంచెం జ్వరం రాగానే ఇంత ఆర్భాటం జరుగుతోంది. కాని నేనేం చేశాను? కేవలం పదిహేను రోజులుకూడా నిండని ఒక బిడ్డని తల్లి నుండి వేరు చేశాను. తల్లి ఒడిలో వెచ్చగా పడుకుని హాయిగా ఉండవలసిన కుక్కపిల్లని కసాయివాడిలా తీసుకొచ్చేశాను. మూగ జంతువు కనుక మరేమీ చెయ్యలేక పాలు తాగకుండా తన నిరసన తెలియజేస్తోందా కుక్కపిల్ల. నేను కుక్కపిల్లని తీసుకొస్తున్నప్పుడు దాని తల్లి 'అదోలా' చూసిన చూపులకి అర్థం తెలిసింది.

కుక్కపిల్లతో సహా హఠాత్తుగా బయలు దేరిన నన్ను చూసి ఇంట్లో అందరూ ఆశ్చర్యపోయారు. పాపకి నయం అయిన తరువాత వెళ్లమని సుగుణ బతిమాలింది. కాని ఇప్పుడు నా మనోఫలకం ఒకే ఒక దృశ్యాన్ని చూపిస్తోంది. ఈ కుక్కపిల్ల ప్రాణం పోకముందే దాని తల్లి దగ్గరకు చేర్చాలి. తన దగ్గర పాలు తాగుతున్న దీన్ని వాళ్లమ్మ ఆప్యాయంగా నాకుతుంటే చూడాలి.

